క్లుప్తంగా

ఐటీఐలో మిగులు సీట్ల భర్తీ

కాజీపేట : స్థానిక ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో మిగులు సీట్లను భర్తీ చేయడానికి వాక్–ఇన్ అడ్మిషన్ల కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెలఖారు వరకు 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి. మొ దటి, రెండోసారి దరఖాస్తు చేసుకున్న వారు ప్రస్తుతం ఆన్‌లైన్ చేయాల్సిన అవసరం లేదన్నారు. ప్రతీ రోజు ఉదయం 11 గంటల వరకు కళాశాలకు వచ్చి రిపోర్ట్ చేయాలని కోరారు.

‘ఎస్సార్’లో హాకథాన్

హసన్‌పర్తి : నగర శివారులోని ఎస్సార్ యూనివర్సిటీలో హాకథాన్ పోటీలు నిర్వహించారు. శనివారం ఉదయం 9 నుంచి ఆదివారం ఉదయం 9 గంటల వరకు సాగాయి. వివిధ విశ్వవిద్యాలయాలలకు చెందిన సుమారు 100 మందిపైగా విద్యార్థి బృందాలు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ సృజనాత్మకత, సమస్యల పరిష్కార నైపుణ్యాలు, సాంకేతిక ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎస్సార్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ దీపక్ గార్గ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తులు వెలికి తీయడానికి ఇలాంటి వేదికలు దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో వైస్‌చాన్సలర్ డాక్టర్ మహేష్, శశికళ, రూపేష్, సురేష్‌కుమార్, అనిరుథ్ పాల్గొన్నారు.

తేనెటీగల పెంపకంపై అవగాహన

మామునూరు : ఖిలావరంగల్ మండలం తిమ్మాపురం గ్రామంలో ఎస్సార్ యూనివర్సిటీ అగ్రికల్చరల్ విద్యార్థుల ఆధ్వర్యంలో ఆదివారం తేనెటీగల పెంపకంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ డీన్ డాక్టర్ భూపాల్‌రాజ్ మార్గనిర్దేశంలో రావేపా కోఆర్డినేటర్ శ్రీకర్‌రెడ్డి, గ్రామ కోఆర్డినేటర్ బి.మధు విశ్వవిద్యాలయ ఎంటమాలజిస్ట్ డాక్టర్ లాల్‌సింగ్ రాథోడ్ పర్యవేక్షణలో తేనె ఉత్పత్తి విధానం, తేనెటీగల పెంపకానికి అవసరమైన పరికరాలు, వాటి వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఆర్ యూ నివర్సిటీ అగ్రికల్చరల్ విద్యార్థులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ వార్డు కమిటీ ఎన్నిక

మడికొండ: మడికొండ అంబేడ్కర్ సంఘం నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రిటైర్డ్ ఆర్మీ జవాన్ రొడ్డ దయాకర్ ఎన్నిక కాగా ప్రధాన కార్యదర్శిగా మద్దెల రవికుమార్, కోశాధికారిగా మూల నవీన్‌కుమార్, సలహాదారులుగా వెన్నమల్ల రమేశ్ మూల వెంకటస్వామి, జానపట్ల రాజేందర్, దార సూరి, ఉపాధ్యక్షులుగా మూ ల నాగరాజ్ వర్మ, జానపట్ల నికుంజన్‌రావు, కట్ల నగేశ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు దయాకర్ మాట్లాడుతూ అంబేడ్కర్ సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో ఈ నెల 15న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. క్రిష్టియన్ కాలనీ, గాంధీనగర్, ఎస్.ఆర్.నగర్, ఓ సిటీ, 100 ఫీట్ రోడ్, నర్సంపేట రోడ్ ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు. అలాగే హనుమకొండలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. గోపాల్‌పూర్, బ్యాంక్ కాలనీ, సుభాష్ రోడ్, కనకదుర్గ కాలనీ, ఎల్ఐసీ కాలనీ, అమరావతి నగర్, టీవీ టవర్ కాలనీ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఒక ప్రకటనలో వివరించారు.

రవికుమార్‌కు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం



ఉత్తమ పురస్కారం అందుకుంటున్న వెనిశెట్టి రవికుమార్

హన్మకొండ : హనుమకొండ పలివేల్పుల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు వెనిశెట్టి రవికుమార్ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందుకున్నాడు. వైశ్య వికాస వేదిక ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ వనస్థలిపురంలోని ఎం గ్రాండ్‌హోటల్‌లో గురుపూజోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎంపిక చేసిన వారిని ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందించి సన్మానించారు. శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, వైశ్య వికాస వేదిక చైర్మన్ కాసం సత్యనారాయణ గుప్త ఉపాధ్యాయులకు పురస్కారం అందించి సన్మానించారు.

కంపుకొడుతున్న కాలనీలు

- అస్తవ్యస్తంగా డ్రైయినేజీ
- రోడ్ల సౌకర్యం లేక ఇబ్బందులు
- పట్టించుకోని పాలకులు

హసన్‌పర్తి : నగరంలోని ఒకటోవ డివిజన్ ఎర్రగట్టు గుట్ట సమీపంలో ఉన్న కాలనీల్లో కంపుకొడుతోంది. ఈ ప్రాంతంలో రోడ్ల సౌకర్యం కూడా లేదు. కాలనీలు ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా పాలకుల నిర్లక్ష్యం కాలనీవాసులకు శాపంగా మారింది. ఎర్రగట్టుగుట్ట ప్రాంతంలోని బాలజీనగర్, శ్రీనివాసకాలనీ, పద్మావతి, బస్వారెడ్డి టౌన్‌షిప్, అయోధ్యనగర్, తిరుమల కాలనీ, నారాయణనగర్, మంత్రపురికాలనీ, వెంకటేశ్వరకాలనీ–1,2 లు ఉన్నాయి. సుమారు వేయి కుటుంబాలు, ఐదు వేల జనాభా కలిగి ఉంది.

అస్తవ్యస్తంగా మురికి కాల్వలు

ఈ కాలనీల్లో సరైన డ్రైయినేజీ వ్యవస్థ లేదు. ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు పొందిన ఇళ్ల నిర్మాణాలు చేపట్టినప్పటికీ సౌకర్యాలు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇళ్ల నుంచి వచ్చే నీరు రోడ్లు, ఖాళీ స్థలాల్లోకి చేరి నిల్వ ఉండడంతో దోమలకు ఆవాసంగా మారింది. దీంతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు ఎగువభాగం నుంచి వచ్చే వర్షపు నీరు కూడా కాలనీలోకి చేరుతుందని వాపోయారు. భారీ వర్షాలు కురిసినప్పుడు ఏకంగా వరదనీరు ఇళ్లలోకి చేరుతోందన్నారు.



ఖాళీ ప్రదేశాల్లో నిల్వఉన్న మురికి నీరు

రోడ్ల సౌకర్యం లేదు.

ఓవైపు మురికి కాల్వలు..మరో వైపు రోడ్ల సౌకర్యం లేదు. దీంతో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

ఎమ్మెల్యేను కలిసి కాలనీ వాసులు

ఇదిలా ఉండగా ఎర్రగట్టుగుట్ట చుట్టు ఉన్న 17 కాలనీల్లో మురికి కాల్వలు, రోడ్ల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని ఆయా కాలనీల అధ్యక్ష, కార్యదర్శులు, స్థానికులు ఎమ్మెల్యేను కలిశారు. ఈమేరకు మౌళిక సదుపాయాలు కల్పించాలని కోరారు. మురికి కాలవ్లు లేకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నాయని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు.



రోడ్లపైకి వరద నీరు

దుర్వాసన వెదజల్లుతోంది



ఖాళీ ప్రదేశాల్లో మురికి నీరు నిల్వ ఉండడంతో దుర్వాసన వెదజల్లుతోంది. శానిటరీ అధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్లాం. స్పందన లేదు.

– భగవాన్‌రెడ్డి, కాలనీవాసి

శాశ్వత పనులు చేపట్టాలి



కాలనీల్లో శాశ్వత మురికికాల్వలు, రోడ్ల సౌకర్యం కల్పించాలి. దోమల వ్యాప్తి వల్ల జ్వరాల బారిన పడుతున్నాం. పాలకులు, అధికారులు చర్యలు చేపట్టాలి.

– ముత్యాల రఘుపతి, కాలనీవాసి

క్రీడలతోనే క్రమశిక్షణ

- కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వెంకయ్య
- ముగిసిన కేయూ ఇంటర్నల్ టోర్నమెంట్స్

మామునూరు: క్రీడా పోటీల ద్వారా విద్యార్థినుల మధ్య స్నేహ భావంతో పాటు పోటీతత్వం, క్రమశిక్షణ మరింతగా పెరుగుతోందని కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వెంకయ్య, వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ సీహెచ్ సుదర్శన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కే. సునీల్‌రెడ్డి , ఆర్గనైజింగ్ సెక్రటరీ రామాంజనేయులు సూచించారు. ఖిలావరంగల్ మండలం బొల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల క్రీడామైదానంలో కాకతీయ యూనివర్సిటీ ఇంటర్నల్ కాలేజీ టోర్నమెంట్స్ ఫర్ ఉమెన్–2025 వారి ఆధ్వర్యంలో వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల సహకారంతో రెండు రోజులుగా జరుగుతున్న బాలికల కబడ్డీ పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. వాగ్దేవి విద్యాసంస్థల డైరెక్టర్ సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు హాజరై మాట్లాడుతూ క్రీడలు దేహదారుఢ్యానికి, ఆరోగ్యం, మానసికోల్లాసానికి దోహదపడుతాయన్నారు. విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. అనంతరం ఫైనల్‌లో టీటీడబ్ల్యూఆర్ డీసీ కొత్తగూడెం కబడ్డీ బాలికల టీమ్‌పై విజయం సాధించిన కేజీసీ వరంగల్ బాలికల టీంకు ట్రోఫీ, మెమొంటోలు, ప్రశంసపత్రాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, పలు జిల్లాల క్రీడాకారులు పాల్గొన్నారు.



విజేత జట్టుకు ట్రోఫీ, మెమొంటో, ప్రశంసపత్రాలు అందజేస్తున్న ప్రొఫెసర్ వెంకయ్య

పద్మాక్షి శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు



ప్రచార పత్రికను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

హన్మకొండ అర్బన్ : హనుమద్గిరి పద్మాక్షి ఆలయంలో నిర్వహించే దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు సంబంధించి చేపట్టాల్సిన చర్యలపై ఆదివారం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సదర్భంగా ఉత్సవ కార్యక్రమ వివరాలు తెలిపేలా రూపొందించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ముఖ్యంగా రహదారి గుట్టపై వరకు ఏర్పాటు చేయడం, మంచినీటి సౌకర్యం, పార్కింగ్, విద్యుత్ దీపాలంకరణ, సాంస్కృతిక కార్యక్రమాలు, సద్దుల బతుకమ్మ నిమజ్జనం అనంతరం పద్మాక్షి గుండంను శుభ్రపరిచి తెప్పోత్సవానికి కావలసిన ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఆదేవిధంగా ట్రస్ట్, పరపతి సంఘాలు దాతల ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ, తాగునీరు, అర్చన, హోమాల గురించి దేవాలయ వేదపండితులు నాగిళ్ల షణ్ముఖ పద్మనాభ అవధాని, దేవాలయ అర్చకులు నాగిళ్ల శంకర్‌శర్మ, పద్మాక్షి పరపతి సంఘం, పద్మాక్షి సేవా సంఘం, అధ్యక్షులు కోశాధికారి రాజ్‌కుమార్ తదితరులు మాట్లాడారు. ప్రభుత్వ పరంగా పొందాల్సిన సాయం, సదుపాయాలపై చర్చించారు. సమావేశంలో ప్రతినిధులు సదానందం, బుచ్చిరాజు, బొల్లం అశోక్, శ్యాంసుందర్ రెడ్డి, గిరి రాజయ్య, నాగిళ్ల రఘు శర్మ, మునిగోటి రమేశ్, పాల్గొన్నారు.

గాంధీ మార్గం సమాజానికి అవసరం

- ఎమ్మెల్యేలు కేఆర్.నాగరాజు, నాయిని రాజేందర్‌రెడ్డి



హసన్‌పర్తి: పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు



హన్మకొండ చౌరస్తా: ఎమ్మెల్యే నాయినికి గాంధీజీ విగ్రహాన్ని అందిస్తున్న ఫెడరేషన్ బాధ్యులు

హసన్‌పర్తి/హన్మకొండ చౌరస్తా: మహాత్మగాంధీ చూపిన శాంతి, అహింస, స్వదేశీ మార్గం సమాజానికి అవసరమని వర్ధన్నపేట, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యేలు కే.ఆర్.నాగరాజు, నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. మహాత్మగాంధీ జీవితం, సిద్ధాంతాలు ప్రస్తుత తరానికి పరిచయం చేసేందుకు గ్లోబల్ గాంధీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అక్టోబర్ 10 నుంచి 13వరకు చేపట్టిన ‘లక్ష గాంధీ విగ్రహాల ప్రదర్శన’ పోస్టర్‌ను వారు ఆదివారం ఆవిష్కరించారు. అనంతర ఎమ్మెల్యేలు మాట్లాడుతూ నేటి యువతకు గాంధీ సిద్ధాంతాలు చేరవేయడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడుతాయన్నారు. గ్లోబల్ గాంధీ ఫెడరేషన్ బాధ్యుడు రాజేందర్‌రెడ్డి మాట్లాడుతు అక్టోబర్ 10 నుంచి 13 వరకు హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో మహాత్మ గాంధీ జాతీయ సుస్థిర విజ్ఞాన సదస్సు, స్వదేశీ మేళా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కార్యక్రమానికి రావాల్సిందిగా ఎమ్మెల్యే నాయినిని ఆహ్వానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు నమిండ్ల శ్రీనివాస్, ఏఐసీసీ కో–ఆర్డినేటర్ పులి అనిల్, నాయకులు డాక్టర్ అనిల్, సాయిచంద్, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘వారాల’ సంఘం అభివృద్ధికి సహకరిస్తా

- ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు

హసన్‌పర్తి : వారాల సంఘం అభివృద్ధికి సహకరిస్తానని వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజు అన్నారు. స్థానిక వారాల సంఘం నూతన కార్యవర్గ సభ్యులు ఆదివారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను ఎమ్మెల్యే శాలువలతో అభినందించారు. సమస్యలతో కూడిన వినతిపత్రం ఎమ్మెల్యేకు అందజేశారు. అనంతరం నాగరాజు మాట్లాడుతూ వారాల సంఘానికి ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సంఘం అధ్యక్షుడు పాపిశెట్టి రాజు, ప్రధాన కార్యదర్శి గుండమీది కృష్ణమోహన్, సభ్యులు ప్రవీణ్, జలేందర్, అభిలాష్,బాలరాజు, నన్నుంశెట్ట మహేష్, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రేటర్ వరంగల్ లంబాడీ జేఏసీ కమిటీ ఎన్నిక

హన్మకొండ : లంబాడీ జేఏసీ గ్రేటర్ వరంగల్ శాఖను నియమించినట్లు జేఏసీ రాష్ట్ర కన్వీనర్లు జైసింగ్ రాథోడ్, జాటోత్ కిషన్ నాయక్ తెలిపారు. లంబాడీల ఎస్టీ రిజర్వేషన్ కాపాడుకునేందుకు మహోన్నత ఉద్యమానికి సిద్ధం కావాల్సి ఉందని, ఈ క్రమంలో లాంబాడీలను సమీకరించేందుకు కమిటీలు వేస్తున్నట్లు వారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రేటర్ వరంగల్ లంబాడీ జేఏసీ చైర్మన్‌గా భూక్యా మోతీలాల్ నాయక్, కన్వీనర్లుగా బానోత్ నవీన్‌నాయక్, నూనావత్ జవహర్ నాయక్ నియమించినట్లు తెలిపారు. కోకన్వీనర్‌లుగా భూక్యా హుస్సేన్ నాయక్, గుగులోపు వీరన్న, ధరావత్ రామచందర్ నాయక్, ధరావత్ దేవేందర్ నాయక్, అంగుత్ సుధాకర్ నాయక్, లావుడ్యా రాజు నాయక్, అజ్మీరా సునీత బాయి, తేజావత్ పడికుమార్ నాయక్, భూక్య రమేష్ నాయక్, బానోత్ వీరు నాయక్, లావుడ్యా బాలు నాయక్, బానోత్ అశోక్ నాయక్, బానోత్ శ్రీకాంత్ నాయక్, భూక్య సిద్ధు నాయక్, ధరావత్ రాము నాయక్, లావుడియా రాము నాయక్, బానోత్ ఈరియా నాయక్‌ను నియమించినట్లు వారు వివరించారు.

‘ఆపరేషన్ కగార్’ను నిలిపివేయాలి

- సాహిత్య, సాంస్కృతిక వేదిక కన్వీనర్ రవీందర్

విద్యారణ్యపురి : కేంద్రప్రభుత్వం అపరేషన్ కగార్‌ను నిలిపివేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని సాహిత్య, సాంస్కృతిక వేదిక కన్వీనర్ మెట్టు రవీందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండ వడ్డేపల్లిలో నిర్వహించిన తంగెళ్ల శృతి పదేళ్ల యాది సభకు శృతి తండ్రి తంగెళ్ల సుదర్శన్ అధ్యక్షత వహించగా రవీందర్ ప్రధాన వక్తగా మాట్లాడారు. యువత సాయుధ పోరాటాన్ని ఎందుకు ఎంచుకుంటుందో ప్రభుత్వం ఆలోచించాలన్నారు. సమాజంలో అసమానతలు నిర్మూలించకుండా ఉద్యమకారులను హతమార్చటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రసాధనతో తమ కలలు నెరవేరుతాయని భావించిన యువతకు ఫలితం లభించలేదని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణా రాష్ట్ర ఏర్పడిన తొలి ఏడాదిలోనే తంగెళ్ల శృతి, సాగర్‌లను తెలంగాణ ప్రభుత్వం భూటకపు ఎన్‌కౌంటర్‌లో హత్యచేసిందని ఆరోపించారు. ఈశాన్య రాష్ట్రాల పలు సాయుధ సంస్థలతో చర్చలు జరిపిన ఎన్‌డీఏ ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరిపేందుకు ఏమిటీ ఇబ్బందులు అని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, గంగాధర్, వివిధ సంఘాల బాధ్యులు గోవర్ధన్, దుర్గాప్రసాద్, కవులు ఆదిరెడ్డి, శాఖమూరి అమరుల బంధుమిత్రుల సంఘం జిల్లా బాధ్యులు భారతక్క, ఊర్మిళ, తెలంగాణా ప్రజాఫ్రంట్ రాష్ట్ర బాధ్యురాలు రమాదేవి, పార్వతి, వివేక్ తల్లిదండ్రులు యోగానంద్, మాధవి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మెట్టు రవీందర్

రక్తదానం చేస్తే ప్రాణ దానం చేసినట్లే

- బీజేపీ రాష్ట్ర నాయకుడు వెంకటరమణ

ఖిలా వరంగల్: రక్త దానం చేస్తే ప్రాణదానం చేసినట్లేనని, ఈనెల 17న నిర్వహించే మెగా రక్తదాన శిబిరానికి ప్రతీ ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ వన్నాల వెంకటరమణ పిలుపునిచ్చారు. ఆదివారం కరీమాబాద్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు బోరిగం నాగరాజు ఆధ్వర్యంలో సేవా పక్షం వరంగల్ జిల్లా కో కన్వీనర్ కర్నె రవీందర్ అధ్యక్షతన ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ వెంకటరమణ హాజరై మాట్లాడుతూ ప్రధాని మోదీ జన్మదినం సందర్భగా ఈనెల 17న నిర్వహించే రక్తదాన శిబిరం, మొక్కలు నాటడం, దీన్‌దయాల్‌కు నివాళులర్పించటం లాంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు,అభిమానులు హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీజేపీ నాయకులు ఆకుతోట రాజు, రాధారపు మహేష్, మందాడి సందీప్, కిరణ్, దేవేందర్, స్వరూప, లావణ్య, లలిత, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వన్నాల వెంకటరమణ

పదోన్నతి పొందిన వారికి సన్మానం

విద్యారణ్యపురి : పదోన్నతి పొందిన హెచ్‌ఎంలకు, ఉపాధ్యాయులకు ఆదివారం హనుమకొండలోని ప్రాక్టీసింగ్ హైస్కూల్‌లో టీఎంఎఫ్ వరంగల్ శాఖ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి , టీఎంఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కందికొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొని సన్మానం చేశారు. శ్రీపాల్‌రెడ్డిని టీచర్లు, హెచ్‌ఎంలు దుశ్శాలువాకప్పి సన్మానించారు.

గజల్ గాయనికి..

హన్మకొండ కల్చరల్ : కొమర్రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభ వేదికపై సినారె గజల్ పురస్కారాల మహోత్సవం నిర్వహించారు. హనుమకొండకు చెందిన గజల్ గాయని గంకిడి అరుణ కీర్తి పతాకారెడ్డిని నిర్వహకులు పురస్కారం మెమోంటో అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

విద్యారణ్యపురి : కాకతీయ యూనివర్సిటీ పాలకమండలి సభ్యురాలు, అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్‌పర్సన్ డాక్టర్ అనితారెడ్డి వర్సిటీ సమీపంలోని వృద్ధాశ్రమంలో ఆదివారం వృద్ధులకు అన్నదానం చేశారు. స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. మానవ సేవయే మాధవ సేవ అని వృద్ధులపై ప్రతీ ఒక్కరు ప్రేమతో వ్యవహరించాలని కోరారు. ఆమె వెంట నరేశ్, ఉప్పలయ్య పాల్గొన్నారు.

కథాకావ్య సమాలోచనం గ్రంథావిష్కరణ

విద్యారణ్యపురి : సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ వరంగల్ ఆధ్వర్యంలో కేయూ రిటైర్డ్ ఆచార్యులు అనుమాండ్ల భూమయ్య రచించిన సీ.నారాయణరెడ్డి కథాకావ్య సమాలోచనం గ్రంథావిష్కరణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. వడ్డేపల్లిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆ సంస్థ అధ్యక్షుడు గిరిజామనోహర్‌బాబు ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. రచయితలు నల్లప్రభావతిదేవి, ఎం.విజయలక్ష్మి, తాడిచెర్ల రవి, పుస్తక పరిచయం చేశారు. వెంకన్న, లక్ష్మణ్, లక్ష్మీకాంతారావు, మురళీధర్ పాల్గొన్నారు.

పాత పెన్షన్ అమలు చేయాలి

కాజీపేట రూరల్ : కేంద్రప్రభుత్వం రైల్వే కార్మికులకు న్యూపెన్షన్ స్కీం, యూనిఫైడ్ పెన్షన్ స్కీంను రద్దు చేసి పాత పెన్షన్‌నే అమలు చేయాలని సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ జోనల్ జనరల్ సెక్రటరీ భరణిభానుప్రసాద్ అన్నారు. స్థానిక రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ కార్యాలయంలో ఆదివారం రైల్వే సంఘ్ ఈఎల్ఎస్ మాజీ ట్రెజరర్ (ఈఎల్ఎస్ టెక్–2) కె.శారద పదవీ విరమణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ కేంద్రం 8వ పేకమిషన్ కమిటీ వేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ జోనల్ ఎజీఎస్ టి.డి.సత్యవాణి, రైల్వే సంఘ్ సికింద్రాబాద్ డివిజన్ ప్రెసిడెంట్ కొత్త మురళీకృష్ణ, డివిజనల్ నాయకులు వేగి మురళికృష్ణ, సాదినేని వెంకటనారాయణ, దిలీప్, మహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

విద్యనందించడంలో ప్రైవేట్ విద్యాసంస్థల కీలకపాత్ర

- కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ విజయబాబు



మాట్లాడుతున్న రిటైర్డ్ ప్రొఫెసర్ విజయబాబు

విద్యారణ్యపురి: విద్యావ్యాప్తిలో ప్రభుత్వ విద్యాసంస్థలతో పాటు ప్రేవేటు విద్యాసంస్థలు కూడా కీలక పాత్ర పోషిస్తున్నాయని అందులో పనిచేస్తున్న ఉపాధ్యాయులు విద్యార్థులను తీర్చిదిద్దటంలో వారి పాత్ర ఎంతో కీలకమని కాకతీయ యూనివర్సిటీ హిస్టరీ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ ఆచార్య కె.విజయబాబు అన్నారు. ఆదివారం హనుమకొండ డిస్ట్రిక్ట్ అన్ ఎయిడెడ్ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ (హదుప్సా) ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వాగ్దేవి డిగ్రీ అండ్ పీజీ కళాశాల సెమినార్ హాల్‌లో 75 ప్రైవేటు పాఠశాలల్లోని 75 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానించారు. సభలో ఆయన విశిష్ట అతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేలా నైపుణ్యాలను పెంచుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న టీచర్ల పనితీరు గుర్తించి ఉత్తమ టీచర్లుగా ఎంపిక చేసి హదుప్సా సన్మానించడం అభినందనీయమన్నారు సమావేశంలో హనుమకొండ ఎంఈఓ నెహ్రూనాయక్, హదుప్సా అధ్యక్షుడు టి బుచ్చిబాబు, జనరల్ సెక్రటరీ ఎం.సంతోష్‌రెడ్డి, కోశాధికారి డి.శంకర్, ముఖ్యసలహాదారు జనార్దన్, సలహాదారులు వేణు మాధవరావు, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటరమణ, బాధ్యులు, 75 పాఠశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు. 75 మంది ఉత్తమ ఉపాధ్యాయులను అతిథులు శాలువాలు కప్పి ప్రశంసపత్రాలను అందజేశారు.

వీధి కుక్కలను సంరక్షణ కేంద్రానికి తరలించాలి

ఖిలా వరంగల్: పగలు, రాత్రి స్వైర విహారం చేస్తూ దాడులకు దిగుతున్న వీధి కుక్కలను పట్టి సంరక్షణ కేంద్రానికి తరలించాలని బీజేపీ నాయకుడు అడెపు వెంకటేష్ డిమాండ్ చేశారు. ఆదివారం వరంగల్ 36వ డివిజన్ చింతల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చింతల్ ఏరియాలో వీధి కుక్కలు దాడి చేసి 18 మందిని కరిస్తే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని, కుక్కలను చూసి ప్రజలు బిక్కుబిక్కు మంటూ ఇళ్లల్లో బందీలైపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్టడీ టూర్ల పేరుతో లక్షలు ఖర్చు చేయొచ్చు కానీ, ప్రజలపై దాడి చేసే కుక్కలను బల్దియా పట్టకపోవడం బాధాకరమని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు

టీ–శాట్ ద్వారా ఉత్తమ టీచర్ ప్రసంగం



టీ–శాట్ స్టూడియో ద్వారా ప్రసంగిస్తున్న ఉత్తమ అవార్డు గ్రహీత సీహెచ్.రాములు

విద్యారణ్యపురి : హైదరాబాద్‌లోని టీ–శాట్ ద్వారా ఇటీవల రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన హనుమకొండలోని లష్కర్‌బజార్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు సీహెచ్.రాములు ప్రసంగం చేశారు. ఆదివారం హిందీ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని టీ–శాట్ సీఎంఓ అధ్యక్షతన ప్రత్యక్షప్రసారం నిర్వహించారు. ఉపాధ్యాయుడిగా ఎలా తన సృజనాత్మక శక్తితో విద్యార్థులకు విద్యాబోధన చేయాలో, ఉపాధ్యాయులకు ఆదర్శ గుణాలు ఎలా ఉండాలో అవి విద్యార్థులకు ఎలా ఉపయోగపడాలో వివరించారు. నిర్వాహకులు రాములును దుశ్శాలువాతో సన్మానించారు. డాక్టర్ మతీన్ అహ్మద్, ప్రొఫెసర్ నాజిమా తదితరులు పాల్గొన్నారు.